ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
తమిళనాడు
TAMILNADU
ఆదివారం 18 ఆగస్టు 2024

తెలుగుకు చేయూత

● తెలుగు పాఠ్యాంశంలో ప్రథమ ర్యాంకర్‌కు రూ.2లక్షల నజరానా
● ప్రవాస భారతీయుడి ఔదార్యం


విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తున్న దృశ్యం

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మాతృభాషలో మాట్లాడడమంటే నామోషీగా భావిస్తున్న రోజులివి.. అలాంటిది తన మాతృభాష తెలుగు పట్ల మమకారం కలిగిన ఓ ప్రవాస భారతీయుడు.. తెలుగు అభివృద్ధి కోసం తనవంతు కృషి మొదలుపెట్టారు. తెలుగు సబ్జెక్టులో ప్రథమ ర్యాంకు సాధించిన వారికి రూ.2లక్షలు బహుమతిగా ఇస్తానని ప్రకటించారు. ఆ మేరకు స్థానిక టీ.నగర్‌లోని కేసరి మహోన్నత పాఠశాల విద్యార్థినికి నజరానా అందించారు. ఆయనే ప్రవాస భారతీయుడు డాక్టర్ రాఘవేంద్ర చౌదరి. శనివారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో తెలుగు పాఠ్యాంశంలో పాఠశాల స్థాయి ప్రథమ ర్యాంకు సాధించిన జననికి చౌదరి దంపతులు ఈ మొత్తాన్ని అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగుల గోపాలయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి, పారిశ్రామికవేత్తలు శైలేంద్రకుమార్, సురేంద్ర, గుండపనేని సుబ్రమణ్యం తదితరులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర చౌదరి మాట్లాడుతూ... ఆ రోజుల్లో ఈ పాఠశాల లేకున్నట్లయితే తాను ఈ రోజు ఈ స్థానంలో ఉండేవాడిని కాదన్నారు. తాను ఉన్నతస్థితికి చేరుకునేందుకు పాఠశాల ఎంతో దోహదపడిందన్నారు. అందుకే తన వంతుగా పాఠశాలకు ఏదో ఒకటి చెయ్యాలన్న ఉద్దేశంతో బాలబాలికలను ప్రోత్సహించేందుకు ఈ నగదు బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ తన సహాయ సహకారాలుంటాయని హామీ ఇచ్చారు. పాఠశాలలో విద్యార్థుల క్రమశిక్షణ చూసి తనకు ఆశ్చర్యం కలుగుతోందన్నారు. వారిని ఇలా తీర్చిదిద్దడంలో ప్రధానోపాధ్యాయుడు సహా సహచర ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని అభినందించారు.

నేడు చెన్నైకి కేంద్రమంత్రి రాజ్‌నాథ్

● కరుణ రూపంతో వంద రూపాయల నాణెం ఆవిష్కరణ



చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం చెన్నైకి విచ్చేయనున్నారు. మంత్రి రాకను పురస్కరించుకుని నగరవ్యాప్తంగా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. డీఎంకే మాజీ అధ్యక్షుడు కరుణానిధి శతజయంతి ముగింపు వేడుకల సందర్భంగా కేంద్రప్రభుత్వం ఆయన రూపంతో ముద్రించిన వంద రూపాయల నాణేన్ని మంత్రి రాజ్‌నాథ్ ఆవిష్కరించనున్నారు. స్థానిక చేపాక్ స్టేడియంలో ఏర్పాటవుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం ఆయన ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానం ద్వారా చెన్నైకి చేరుకుంటారు. మీనంబాక్కం విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు హెలికాప్టర్ ద్వారా మెరీనా బీచ్ నేపియర్ బ్రిడ్జి సమీపంలోని కోస్ట్‌గార్డ్ ప్రధాన కేంద్రానికి చేరుకుంటారు. అక్కడ కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన భవనాన్ని, జాలర్ల రక్షణ కోసం ఏర్పాటు చేస్తున్న కంట్రోల్ రూంను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పుదుచ్చేరి కోస్ట్‌గార్డ్ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన సదుపాయాలను ఆయన పరిశీలించనున్నారు. ఆ తర్వాత కోస్ట్‌గార్డ్ సభ్యులు కడలిలలో కొట్టుపోయేవారిని కాపాడే విధానాన్ని తెలిపేలా జరపనున్న విన్యాసాలను కూడా ఆయన తిలకించనున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి కారులో బయలుదేరి మెరీనా బీచ్‌లోని కరుణానిధి సమాధి ప్రాంతానికి చేరుకుంటారు. అక్కడ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు ఆయనకు స్వాగతం పలుకుతారు. కరుణానిధి సమాధి వద్ద నివాళులర్పించిన తర్వాత ఆయన కారులో బయలుదేరి సాయంత్రం 6.30 గంటలకు చేపాక్ కలైవానర్ అరంగం ప్రాంతానికి చేరుకుంటారు. ఆ అరంగంలో సభలో ఆయన పాల్గొని కరుణానిధి స్మారక రూ.100 నాణేన్ని ఆవిష్కరించనున్నారు. రాజ్‌నాథ్ సింగ్ పర్యటనను పురస్కరించుకుని కలైవానర్ అరంగం చుట్టుపక్కలి ప్రాంతాల్లో పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. అడయార్ కోస్ట్‌గార్డ్ ప్రాంతం వద్ద, కరుణానిధి సమాధి వద్ద ఇప్పటికే సాయుధ దళం పోలీసులు కాపలా కాస్తున్నారు.

అన్నాడీఎంకే బలోపేతానికి త్వరలో ఈపీఎస్ రాష్ట్రవ్యాప్త పర్యటన



ప్యారీస్, ఆగస్టు 17: రాష్ట్ర అసెంబ్లీకి 2026వ సంవత్సరం జరగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) త్వరలో 234 నియోజకవర్గాల వ్యాప్తంగా పర్యటించనున్నారు. ఈపీఎస్ పర్యటన మ్యాప్‌ను, ఆయన పాల్గొననున్న సభల ఏర్పాట్లను ఆ పార్టీ జిల్లా కార్యదర్శులు చేపట్టారు. అన్నాడీఎంకే అత్యవసర కార్యనిర్వాహకుల సమావేశం శుక్రవారం పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్‌మగన్ హుస్సేన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఇటీవల లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందిన నియోజకవర్గాల ప్రజలతో ఈపీఎస్ మమేకమై అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అమలుపరచిన పథకాలను వివరించాలని నిర్ణయించారు. అంతేకాకుండా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బలమైన కూటమి ఏర్పాటు చేయాలని, డీఎంకే ప్రభుత్వ వైఫల్యాలు విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కార్యదర్శులకు ఈపీఎస్ దిశానిర్దేశం చశారు. పార్టీ ఓటు బ్యాంక్ శాతం తక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాల స్థాయిలో పార్టీని పటిష్ఠ పరచడం, స్టార్ ప్రచారకులకు ప్రాముఖ్యం కల్పించడం తదతర అంశాలపై ఈపీఎస్ తన పర్యటనలో దృష్టి సారిస్తారని ఆ పార్టీ సీనియర్ నేతలు తెలిపారు.



గర్భంలోనే ఛిద్రం

రాష్ట్రంలో మూడున్నరేళ్లలో 3.28 లక్షల అబార్షన్లు

● లెక్కకు రానివెన్నో?

పెరంబూర్, ఆగస్టు 16: గర్భంలోనే ప్రాణాలు ఛిద్రమైపోతున్నాయి. కారణమేదైనాగానీ రోజురోజుకు గర్భవిచ్ఛిత్తి ఘటనలు పెరిగిపోతున్నాయి. గత మూడున్నరేళ్లలో ఏకంగా 3.28 లక్షల అబార్షన్లు జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతుండగా, ఇక అనధికారికంగా జరిగినవెన్నో ఆ దేవుడికే ఎరుక! రాష్ట్రంలో జిల్లాల వారీగా ఎన్ని అబార్షన్లు జరిగాయంటూ ఓ టీవీ ఛానల్ సహచార హక్కు చట్టం ద్వారా అడగడంతో అసలు విషయం వెల్లడైంది. ఎంటీపీ చట్టం ప్రకారం 'ప్రేరేపిత అబార్షన్లు' ఫారం 3 ప్రకారం ఆరోగ్య కేంద్రాల్లో నమోదు చేయబడుతున్నాయి. అలాగే, ఏళ్ల వారీగా అబార్షన్ చేయించుకున్న వారి వివరాలు సేకరిస్తున్నట్లు కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టరేట్ తెలియజేసింది.



ఆ ప్రకారం, 2021 జనవరి 1 నుంచి ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు ఆయా జిల్లాల్లో 15-19, 20-24, 25-29, 30-34, 35-39, 40-44, 45+ వయస్సుల వారీగా అబార్షన్ చేయించుకున్న మహిళల వివరాలు సేకరించే పనుల్లో ఉన్నట్లు పేర్కొంది.

చెన్నైలోనే అధికం....

రాష్ట్రవ్యాప్తంగా 42 నెలల్లో 19 ఏళ్లకు పైబడిన మహిళలకు 3,28,970 అబార్షన్లు జరిగాయి. అబార్షన్లలో చెన్నై జిల్లా 25,423తో అగ్రస్థానంలో నిలిచింది. తదుపరి సేలం జిల్లాలో 22,707, ఈరోడ్‌లో 17,067, కోవైలో 16,820, తిరుచ్చిలో 15,303, తిరువణ్ణామలైలో 12,794, తిరుప్పూర్‌లో 11,568, మదురైలో 11,325 అబార్షన్లు జరిగాయి. ఇక అత్యల్పంగా నీలగిరి జిల్లాలో 2,958, కాంచీపురంలో 2,952, రాణిపేటలో 3,042 అబార్షన్లు జరిగాయి. అలాగే, 19 ఏళ్ల కంటే తక్కువ వయసున్న బాలికలకు 24 వారాల వరకు అబార్షన్ చేయడానికి ప్రత్యేక డిక్రీ, కోర్టు ఉత్తర్వులు అవసరం లేదని డైరెక్టరేట్ పేర్కొంది. అంతకంటే ఎక్కువ నెలలు నిండిన వారికి మాత్రం ప్రత్యేక ఉత్తర్వులతో బాలికలకు అబార్షన్లు నిర్వహించనున్నట్లు తెలిపింది. బాలికల అబార్షన్‌లకు సంబంధించిన సమాచారం తమ వద్ద లేదని, బాలికలకు సంబంధించిన సమాచారాన్ని ఆరోగ్యశాఖలోని డైరెక్టరేట్ ఆఫ్ రూరల్ వెల్ఫేర్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ప్రివెంటివ్ మెడిసిన్స్ డైరెక్టరేట్లు అందజేస్తాయని తెలిపింది. అదే సమయంలో పరువు ప్రతిష్ఠలకు భంగం కలుగుతుందని భయపడి పలువురు ప్రైవేటుగా, సొంతంగా అబార్షన్లకు పాల్పడుతున్నారని కూడా డైరెక్టరేట్ అనుమానం వ్యక్తం చేసింది.

రూ.1916 కోట్లతో అత్తికడవు-అవినాశి పథకం

కొంగునాడులో 24 వేల ఎకరాలకు సాగు జలాలు ● ప్రారంభించిన సీఎం స్టాలిన్


అత్తికడవు - అవినాశి పథకాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జల వనరుల శాఖ ఆధ్వర్యంలో కోయంబత్తూరు, ఈరోడ్, తిరుప్పూరు జిల్లాల్లో 24,468 వేల ఎకరాల భూములకు సాగునీటిని అందించేలా రూ.1916.41 కోట్లతో నిర్మించిన అత్తికడవు - అవినాశి పథకాన్ని సీఎం స్టాలిన్ ప్రారంభించారు. శనివారం ఉదయం సచివాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈరోడ్ జిల్లా భవానీ కాళింగరాయన్ ఆనకట్ట సమీపంలో నిర్మించిన మొదటి పంపింగ్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. 1972 నుంచి ఈ పథకం కోసం కొంగునాడు జిల్లాలకు చెందిన రైతులు, ప్రజలు పోరాడుతున్నారు. కరుణానిధి సీఎం ఉన్నప్పుడు తొలిసారిగా ఈ పథకం సాధ్యాసాధ్యాలపై నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. నాలుగేళ్లపాటు ఈ పథకానికి సంబంధించి ప్రాథమిక స్థాయి పనులన్నీ పూర్తయి ప్రాజెక్టు నిర్మాణ పనులు జరగాల్సిన సమయంలో 1976లో డీఎంకే ప్రభుత్వం అధికారంలతో కోల్పోయింది. అప్పటి నుంచి ఈ ప్రాజెక్టు అమలుకు నోచుకోకపోయింది. 1996లో మళ్లీ డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అత్తికడవు - అవినాశి పథకం పనులు చురుగ్గా సాగాయి. 2019లో అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలోనూ ఈ పథకం పనులు కొనసాగాయి. 2021లో స్టాలిన్ ముఖ్యమంత్రి కాగానే నత్తనడక సాగిన ఈ ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయి. ఈ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.1916.417 కోట్లకు పెంచి ఎట్టకేలకు పనులన్నీ పూర్తి చేయించారు. చివరకు కోయంబత్తూరు, ఈరోడ్, తిరుప్పూరు జిల్లా ప్రజలు, రైతులు ఐదు దశాబ్దాల కోరిక నెరవేరింది.

70 రోజుల పాటు...

భవానీవాగులో కాళింగరాయన్ ఆనకట్ట దిగువ భాగం నుంచి యేటా 1.50 టీఎంసీల అదనపు జలాలను సెకనుకు 250 ఘనపుటగుల చొప్పున 70 రోజులపాటు పైప్‌లైన్ల ద్వారా సాగుజలాలను అందించటానికి వీలువుతుంది. ఈ పథకం ద్వారా కోయంబత్తూరు సహా మూడు జిల్లాల్లో జల వనరుల శాఖకు చెందిన 32 చెరువులు, పంచాయతీ యూనియన్లకు చెందిన 32 చెరువులు, 971 వాగులకు నీరందించేందుకు అనువుగా 958 కిలోమీటర్ల వరకు భారీ పైప్‌లైన్లు నిర్మించారు. ఈ పథకం ద్వారా పెరుందురై, చెన్నిమలై, నంబియూరు, గోపిశెట్టిపాళయం, ఊత్తుకుళి, అవినాశి, తిరుప్పూరు, అన్నూరు, సూలూరు, పెరియనాయకన్ పాళయం, కారమడై తదితర ప్రాంతాలకు చెందిన 24,468 ఎకరాలకు జలాలు అందించటానికి వీలవుతుందని ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ మంత్రి దురైమురుగన్, ఆదిద్రావిడుల సంక్షేమ శాఖ మంత్రి కయల్‌విళి సెల్వరాజ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, జల వనరుల శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ మణివాసగన్, చీఫ్ ఇంజనీర్ మన్మథన్ తదితరులు పాల్గొన్నారు. ఈరోడ్ జిల్లా భవానీ కాళింగరాయన్ ఆనకట్ట సమీపంలో ఏర్పాటైన ప్రారంభోత్సవ సభలో మంత్రులు సామినాథన్, ముత్తుసామి, ఎంపీ ప్రకాష్, ఎమ్మెల్యేలు ఈఆర్ ఈశ్వరన్, వెంకటాచలం, సరస్వతి, ఈరోడ్ కార్పొరేషన్ మేయర్ నాగరత్నం, ఈరోడ్ కలెక్టర్ రాజగోపాల్ సుంకర, తిరుప్పూరు కలెక్టర్ క్రీస్తురాజ్, కోయంబత్తూరు కలెక్టర్ క్రాంతికుమార్ పాటి తదితరులు పాల్గొన్నారు.

18వేల మహిళా కార్మికులకు మెగా క్వార్టర్స్...

ఫాక్స్‌కాన్ సంస్థ ఆధ్వర్యంలో కాంచీపురం జిల్లా వల్లం - వడకాల్ సిప్కాట్‌లో కర్మాగారాల్లో పనిచేసే మహిళా కార్మికులు బస చేయడానికి రూ.706.5 కోట్లతో, 18,720 పడకల సదుపాయంతో నిర్మించిన మెగా క్వార్టర్స్‌ను సీఎం స్టాలిన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫాక్స్‌కాన్ ఛైర్మన్ యాంగ్‌లీయు మున్, మంత్రులు టీఆర్‌బీ రాజా, దామో అన్బరసన్, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక శాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, సిప్కాట్ మేనేజింగ్ డైరెక్టర్ సెంథిల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

● కోల్‌కాతా వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ

రాష్ట్రవ్యాప్తంగా వైద్యుల ఆందోళన

● జీహెచ్, స్టాన్లీ వద్ద ధర్నా



నిరసన ర్యాలీలో మద్రాస్ మెడికల్ కాలేజీ వైద్యులు, వైద్య విద్యార్థులు

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కోల్‌కాతాలో జూనియర్ మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు శనివారం ఉదయం ఆందోళన చేపట్టారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో వైద్యసేవలు అందక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చెన్నైలోని రాజీవగాంధీ స్మారక ప్రభుత్వ సర్వజనీన ఆసుపత్రిలో సుమారు 300 మంది డాక్టర్లు విధులను బహిష్కరించి ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు, నర్సులకు భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. అవుట్ పేషంట్లను లోపలకు వెళ్లనీయకుండా పీజీ డాక్టర్లు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనలో పాల్గొన్న వైద్యులు నవనీతకృష్ణన్ మాట్లాడుతూ... కోల్‌కాతా మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచారం దేశంలో మరే ఆసుపత్రుల్లో పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. తాము ఆందోళనలో పాల్గొన్నప్పటికీ అత్యవసర చికిత్సలకు ఎలాంటి అంతరాయం కలిగించలేదని చెప్పారు. ఇదే విధంగా స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సుమారు 500 మంది డాక్టర్లు ధర్నా జరిపారు. దీంతో అవుట్‌పేషంట్ల విభాగంలో రోగులు చికిత్సలు పొందకుండా తిరుగుముఖం పట్టారు. క్రోంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు నల్లబ్యాడ్జీలు విధులకు హాజరయ్యారు. సుమారు 50 మంది వైద్యులు ధర్నా జరిపారు. కోల్‌కాతా సంఘటనకు నిరసన తెలుపుతూ తాంబరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, వర్కింగ్ విమెన్ కోఆర్డినేషన్ కమిటీ, మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ఆందోళనలో సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు. ఇదే విధంగా చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రులలోనూ వైద్యులు ఆందోళనలో పాల్గొన్నారు. అత్యవసర శస్త్ర చికిత్సలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా ప్రశాంతంగా ధర్నా నిర్వహించారు. ఇదే తరహాలో తంజావూరు, నాగపట్టినం, తిరువారూరు, మైలాడుదురై జిల్లాల్లో వైద్యులు విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. మదురై, విరుదునగర్, తిరుచ్చి, దిండుగల్ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ వైద్యులు ఆందోళనలో పాల్గొన్నారు. పుదుచ్చేరి జిప్‌మర్ ఆసుపత్రిలో పనిచేసే సుమారు 900 మంది వైద్యులు శనివారం ఉదయం ధర్నా జరిపారు. గత రెండు రోజులుగా వీరు ఆందోళనను కొనసాగిస్తుండంతో వైద్యసేవలందక రోగులు ఇబ్బందులకు గురయ్యారు.



ప్లకార్డ్‌తో వైద్యురాలు

సామూహిక అత్యాచార బాధితురాలికి చికిత్స అందించేందుకు నిరాకరణ

● ప్రభుత్వాసుపత్రికి నోటీసు

వేళచ్చేరి, ఆగస్టు 17: తంజావూరులో సామూహిక అత్యాచారానికి గురైన యువతికి చికిత్స అందించేందుకు నిరాకరించిన వ్యవహారంలో సంజాయిషీ ఇవ్వాలని కోరుతూ పట్టుకోట ప్రభుత్వాసుపత్రికి న్యాయస్థానం నోటీసు జారీ చేసింది. తంజావూరులో 23 ఏళ్ల యువతిపై పాపనాడు ప్రాంతానికి చెందిన కవిదాసన్ (25), అతని స్నేహితులు దివాకర్ (27), ప్రవీణ్ (20), బాలుడు(17) సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై ఒరత్తనాడు మహిళా పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టి నలుగురినీ అరెస్ట్ చేశారు. బాధిత యువతి చికిత్స కోసం పట్టుకోట ప్రభుత్వాసుపత్రికి వెళ్లింది. కానీ, ఆమెకు చికిత్సలందించేందుకు ఆసుపత్రి వైద్యులు నిరాకరించారు. ఈ వ్యవహారంపై ఒరత్తనాడు జిల్లా లా అండ్ జ్యుడిషియరీ ఆర్బిట్రేటర్ ఎస్.అలగేశన్... ఆసుపత్రిలో ఆ రోజున డ్యూటీలో ఉన్న వైద్యుడిపై కేసు ఎందుకు నమోదు చేయరాదంటూ పట్టుకోట ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్య కార్యాలయానికి నోటీసులు జారీచేశారు. ఈ నెల 27వ తేదీ ఈలోగా సమాధానం ఇవ్వాలని స్పష్టం చేశారు.

సమాచార దృశ్యం

చిరుధాన్యాల విక్రయాలకు ప్రత్యేక కేంద్రాలు

ఐసీఎఫ్, ఆగస్టు 17: చిరుధాన్యాల విక్రయాలకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు సహకార శాఖ అధికారులు తెలిపారు. ఈ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సహకార సంఘాలు గిరిజనుల జీవనాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతున్నాయి. ఈరోడ్ సత్యమంగళం సంఘం ముల్లై పేరుతో తేనె విక్రయిస్తోంది. కొల్లిమలై సంఘం ఓరిల్యాండ్ పేరుతో కాఫీ పొడి, కళ్లకుర్చి సంఘం వెల్లిమలై పేరుతో ఒరుగులు, కిలక్కాడు పేరుతో చింతపండు విక్రయిస్తున్నారు. ఇలాగే పలు సంఘాలు రాగులు సహా పలురకాల చిరుధాన్యాలు, పసుపు, మసాలా దినుసులు, నూనె తదితరాలను విక్రయిస్తున్నాయి. ఇవన్నీ ఒకే స్థలంలో విక్రయించేలా ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సహకార శాఖ అధికారులు తెలిపారు.

ఈసీఆర్‌లో వాననీటి కాలువలు

ఐసీఎఫ్, ఆగస్టు 17: స్థానిక ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో రూ.2.20 కోట్లతో వాననీటి కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఫోర్‌వేగా ఉన్న ఈ రహదారిలో తిరువాన్మియూర్ నుంచి అక్కరై వరకు 10.5 కి.మీ దూరం సిక్స్‌వేగా మార్చనున్నారు. ఈ రహదారి తూర్పు దిశలో సముద్రతీరం ఉండడంతో అక్కడి వీధులు ఇసుక ప్రాంతాలుగా ఉన్నాయి. దీంతో ఇక్క వర్షపు నీటి కాలువలు అవసరం లేదు. పశ్చిమ భాగంలో ఉన్న బకింగ్‌హామ్ కాలువలో కలిసేలా ఈసీఆర్‌లో 9 వాననీటి కాలువల నిర్మాణ పనులు చేపట్టారు.

యథావిధిగా గ్రూప్-2ఏ పరీక్షలు

ఐసీఎఫ్, ఆగస్టు 17: గ్రూప్-2, 2ఏ పరీక్షలు యథావిధిగా జరుగుతాయని టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. ఈ పోస్టుల భర్తీకి జూన్ 20వ తేది నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 2,327 పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ జూలై 20న ముగిసింది. 7.90 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులకు సెప్టెంబరు 14వ తేది ప్రిలిమినరీ పరీక్ష జరుగనుండగా, ఈ పరీక్ష తేది మారినట్లు వదంతులు వ్యాపించాయి. దీనిపై స్పందించిన టీఎన్‌పీఎస్సీ నిర్ణయించిన తేదీ ప్రకారమే పరీక్ష జరుగుతుందని పేర్కొంది.

నేటి రాత్రి బీచ్‌కు బదులుగా ఎగ్మూర్ వరకే సబర్బన్ రైళ్లు

ఐసీఎఫ్, ఆగస్టు 17: స్థానిక ఎగ్మూర్ - బీచ్ మధ్య నైట్ సర్వీస్ సబర్బన్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. చెన్నై బీచ్ - ఎగ్మూర్ మార్గంలో నిర్వహణ పనులు జరుగుతున్న కారణంగా ఈ రైళ్లు రద్దుకానున్నాయి. తాంబరం నుంచి చెన్నై బీచ్‌కు ఆదివారం రాత్రి 9.55, 10.10, 10.40, 11.15 గంటలకు బయల్దేరే సబర్బన్ రైళ్లు చెన్నై బీచ్‌కు బదులుగా ఎగ్మూర్ వరకు మాత్రమే నడుస్తాయి. అలాగే, చెన్నై బీచ్ నుంచి తాంబరంకు ఆదివారం రాత్రి 10.30, 11, 11.20, 11.40, 11.59, 19వ తేది వేకువజామున 3.55 గంటలకు బయల్దేరే సబర్బన్ రైళ్లు బీచ్‌కు బదులుగా ఎగ్మూర్ నుంచి బయల్దేరుతాయి. అలాగే, చెంగల్పట్టు నుంచి చెన్నై బీచ్‌కు రాత్రి 10.10, 11 గంటలకు బయల్దేరే రైళ్లు, చెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టుకు రాత్రి 10.45 గంటలకు బయల్దేరే రైలు, తిరుమాల్‌పూర్ నుంచి రాత్రి 8 గంటలకు బయల్దేరే రైళ్లు కూడా బీచ్‌కు బదులుగా ఎగ్మూర్ వరకు మాత్రమే నడువనున్నాయి.

ఎనిమిది మందికి ఆర్థిక సాయం

ఐసీఎఫ్, ఆగస్టు 17: విద్య, వైద్యం కోసం 8 మందికి ముఖ్యమంత్రి స్టాలిన్ రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కలైంజర్ కరుణానిధి ట్రస్ట్ కోసం అందజేసిన రూ.5 కోట్ల డిపాజిట్ నుంచి ప్రతినెలా వచ్చే రూ.2 లక్షల వడ్డీని పేదలకు తలా రూ.25 వేల వంతున 8 మందికి అందిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల వడ్డీని 8 మందికి ముఖ్యమంత్రి అందజేశారు.

గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

పెరంబూర్, ఆగస్టు 17: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ అనుకూల సమయాన్ని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. సోమవారం వేకువజామున 3.06 గంటల నుంచి మంగళవారం వేకువజామున 1.09 గంటల వరకు భక్తుల గిరి ప్రదక్షిణకు అనుకూల సమయమని పేర్కొన్నారు. కాగా, భక్తుల సౌకర్యార్థం స్థానిక కోయంబేడు, కీలంబాక్కం బస్ టెర్మినళ్ల నుంచి సోమవారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రవాణా శాఖ తెలిపింది.

ఒకే రోజు రూ.840 పెరిగిన బంగారం ధర

వేళచ్చేరి, ఆగస్టు 17: నగరంలో బంగారం ధర శనివారం సవరుకు రూ.840 పెరిగి రూ.53,360కి విక్రయమైంది. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో బంగారంపై కస్టమ్స్ సుంకం తగ్గించడంతో వాటి ధరలు తగ్గుతూ వచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లో కొద్దిరోజులుగా ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, బంగారం ధరల్లో కూడా క్రమేణా పెరుగుతున్నాయి. శుక్రవారం ఆభరణ బంగారం సవరు రూ.80 పెరిగి రూ.52,520కి విక్రయమైన నేపథ్యంలో, శనివారం రూ.840 పెరిగింది. అలాగే, ఒక గ్రాముకు రూ.105 పెరిగి రూ.6,670కి విక్రయమైంది. వెండి గ్రాముకు రూ.2 పెరిగి రూ.91, కిలో రూ.2,000 పెరిగి రూ.91,000 విక్రయమైంది.

ఆరు నెలల్లో 6 వేలమందికి యాంజియో చికిత్సలు

వేళచ్చేరి, ఆగస్టు 17: స్థానిక గిండిలో ఉన్న కలైంజర్ సెంటినరీ ఆసుపత్రిలో ఆరు నెలల్లో 6,000 మందికి యాంజియో చికిత్సలు అందించి రికార్డు నెలకొల్పారు. రాష్ట్రంలోనే అత్యాధునిక వైద్య పరికరాలున్న ఆసుపత్రిగా కలైంజర్ సెంటినరీ ఆసుపత్రి పేరుగాంచింది. గుండె సంబంధిత విభాగంలో ఆరు నెలల్లో సుమారు 30,000 మంది రోగులకు యాంజియో పరీక్షలు నిర్వహించినట్లు ఆరోగ్యశాఖ తెలిపింది.

10 పిల్లలకు జన్మనిచ్చిన అనకొండ

ఐసీఎఫ్, ఆగస్టు 17: స్థానిక ఈసీఆర్ రోడ్డును ఆనుకొని ఉన్న వడ నెమ్మెలి మొసళ్ల పార్క్‌లో అనకొండ 10 పిల్లలకు జన్మనిచ్చింది. ఈ పార్క్‌లో మంచినీటి మొసళ్లు, అమెరికా ఉప్పు నీటి మొసళ్లు, అలిగేటర్ మొసళ్లు, పొడవైన నోరు కలిగిన మొసళ్లు, చిత్తడి నేలలో నివసించే మొసళ్లు అని వివిధ రకాల మొసళ్లు సంరక్షిస్తున్నారు. అదే విధంగా దక్షిణాఫ్రికా నుంచి దిగుమతి చేసుకున్న 20 నుంచి 45 అడుగుల వరకు పెరిగే అనకొండ, కొమడో డ్రాగన్, భారీ సైజు బల్లి కూడా ఉన్నాయి. గురువారం అనకొండ 10 పసుపు రంగు పిల్లలకు జన్మనిచ్చింది. పిల్లలు ఆరోగ్యంగా ఉన్నట్లు వెటర్నరీ వైద్యులు తెలిపారు.

కొక్కల్‌లో బీటలు బారిన ఇళ్లపై అధ్యయనం

పెరంబూర్, ఆగస్టు 17: నీలగిరి జిల్లా కొక్కల్‌లో బీటలు బారిన ఇళ్లు, రోడ్లను సెంట్రల్ జియోగ్రఫీ నిపుణులు పరిశీలిస్తున్నారు. గత నెల 27, 28 తేదీల్లో కురిసిన వర్షాలకు కొక్కల్‌లోని 'ఒకటిన్నర సెంట్లు' నివాస స్థలంలో ఆరు ఇళ్లు, వృద్ధాశ్రమం భవనంలో పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ పగుళ్లు రోజురోజుకు పెరుగుతుండడంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనలు చెందారు. దీంతో, ఈ ప్రాంతాన్ని ఈ నెల 7వ తేది నుంచి సెంట్రల్ జియోగ్రఫీ శాఖ పరిశోధకులు యున్‌యో దేబ్ పర్యవేక్షణలో నిపుణులు పగుళ్లను పరిశీలిస్తున్నారు. తొలుత, పగుళ్లు ఏర్పడిన భవనాలు, ఆ ప్రాంతంలో ప్రవహించే వాగులు, మురుగునీటి కాలువలు, వర్షపు నీరు వెళ్లే ప్రాంతాలను పరిశీలించారు. ఆధునిక పరికరాలతో పరిశోధనలు చేపట్టడంతో పాటు ఆ ప్రాంతాల్లో మట్టి నమూనాలు సేకరించి పరిశోధనలకు పంపారు. అలాగే, ఆ ప్రాంతంలో నిరంతరం పగుళ్లు ఏర్పడుతున్నాయా అనే విషయం తెలుసుకొనేందుకు ఐదు ప్రాంతాల్లో భూమిలో గుంతలు తవ్వి చిన్న సైజు సిమెంటు స్తంభాలు ఏర్పాటుచేసి అధ్యయనం చేపడుతున్నారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో వివిధ పరిశోధనలు చేపట్టామని, ఈ పనులు మరికొన్ని రోజులు కొనసాగుతాయన్నారు. భారీవర్షం కురిసే సమయంలో ఐదు ఇళ్లలో నివసించే ప్రజలు రాత్రి వేళ అక్కడ ఉండరాదని సూచించినట్లు తెలిపారు. పరిశోధనలు ముగిసిన తరువాత ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. దాని ఆధారంగా ఈ ప్రాంతంలో చేపట్టాల్సిన తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని నిపుణులు తెలిపారు.



బీటలు వారిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నిపుణులు

తిరుమావళవన్‌కు స్టాలిన్, మంత్రుల శుభాకాంక్షలు



డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ జన్మదిన సందర్భంగా ఆయనను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ శనివారం ఉదయం తన 62వ జన్మదిన వేడుకలను పార్టీ ప్రముఖులు, స్నేహితులు, ఆత్మీయుల నడుమ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీఎంకే కార్యాలయం అన్నా అరివాలయానికి చేరుకుని ముఖ్యమంత్రి స్టాలిన్ నుంచి జన్మదిన శుభాకాంక్షలు స్వీకరించారు. ఇదే విధంగా మంత్రులు దురైమురుగన్, పొన్ముడి, ఉదయనిధి, ఎంపీ దయానిధి మారన్ కూడా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సినీనటులు సత్యరాజ్, రామ్‌రాజ్, దర్శకులు మారి సెల్వం, పొన్‌వణ్ణన్, తుగ్లక్ రమేష్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేదీ తదితరులు ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతు సందేశాలు పంపారు.

చదురగిరి వెళ్లేందుకు భక్తుల నిషేధం



ప్రవేశద్వారం వద్ద భక్తుల పడిగాపులు

పెరంబూర్, ఆగస్టు 17: చదురగిరి సుందర మహాలింగం ఆలయానికి వెళ్లేందుకు ఈ నెల 20వ తేది వరకు భక్తులను అనుమతి లేదని అటవీ శాఖ ప్రకటించింది. విరుదునగర్ జిల్లా పశ్చిమ కనుమల కొండ ప్రాంతంలో ఉన్న సుందర మహాలింగం ఆలయానికి ప్రదోషం సందర్భంగా శనివారం నుంచి ఈ నెల 20వ తేది వరకు భక్తులను అనుమతిస్తున్నట్లు అటవీ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో, పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా ఆ ప్రాంతాల్లోని జలపాతాలు, వాగుల్లో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో భక్తుల భద్రత దృష్ట్యా కొండ ఆలయానికి వెళ్లేందుకు నిషేధిస్తున్నాట్లు శనివారం ఉదయం అటవీ శాఖ ప్రకటించింది. ఇదివరకు విడుదల చేసిన ప్రకటన కారణంగా శనివారం తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కానీ, గేట్లు మూసివేయడంతో నిరాశ చెందారు. కొందరు భక్తులు గేటు సమీపంలోని తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడంతో పాటు ఆ ప్రాంతంలోనే దీపాలు వెలిగించి స్వామివారికి హారతులిచ్చి వెనుదిరిగారు.

దిగుబడులు పెరగడంతో సజ్జ రైతుల ఆనందం



పొలంలో కోతకు వచ్చిన సజ్జ కంకులు

పెరంబూర్, ఆగస్టు 17: చవితి సందర్భంగా వినాయకుడి సన్నిధిలో సజ్జ కంకులు ఉంచి పూజించడం ఆనవాయితీ. ఆ రోజున ప్రజలు సజ్జ కంకులు అధికంగా కొనుగోలు చేస్తుం టారు. ఈ నేపథ్యంలో, తిరువళ్లూర్ జిల్లా పొద్దుటూరు పేట నుంచి తిరుత్తణి వెళ్లే మార్గంలోని జంగాలపల్లి పరిస రాల్లో సుమారు 150 ఎకరాల్లో రైతులు సజ్జ సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పంట కోతకు వచ్చిన సయమంలో, దిగుబడులు కూడా పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా సజ్జలు కిలో రూ.18 నుంచి రూ.20 వరకు విక్రయమవుతున్న నేపథ్యంలో, వినాయక చవితి సందర్భంగా సజ్జ కంకి రూ.5 నుంచి రూ.10కి విక్రయమవుతుండడంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం కోత పనులు చేపట్టిన రైతులు, కోయంబేడు, పల్లిపట్టు, తిరుత్తణి, అరక్కోణం తదితర మార్కెట్లకు తరలించేందుకు సిద్ధమవుతున్నారు.

ఈబీకి రూ.519 కోట్లివ్వండి

● ప్రభుత్వానికి విద్యుత్ నియంత్రణ మండలి ఉత్తర్వులు

పెరంబూర్, ఆగస్టు 17: విద్యుత్ ఛార్జీల పెంపు కారణంగా విద్యుత్ బోర్డుకు అందించే సబ్సిడీ ధర పెరిగినందున అదనంగా రూ.519 కోట్లు అందించాలని విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. తమిళనాడు విద్యుత్ బోర్డు అన్ని గృహాలకు 100 యూనిట్లు ఉచిత విద్యుత్ అందజేస్తోంది. అలాగే, వ్యవసాయం, కుటీర పరిశ్రమలకు విద్యుత్ పూర్తిగా ఉచితం. ఇందుకోసం, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బోర్డు ద్వారా అయ్యే ఖర్చుపై సబ్సిడీ అందిస్తుంది. ఆ ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.15,332 కోట్లు సబ్సిడీగా అందజేయాలని ఇప్పటికే విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్రప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. అందులో గృహాలకు సబ్సిడీగా రూ.7,225 కోట్లు, వ్యవసాయానికి సంబంధించిన సబ్సిడీ రూ.6,780 కోట్లుగా ఉంది. ఈ నేపథ్యంలో, గత జూలై 1వ తేది నుంచి అన్ని విభాగాల విద్యుత్ ఛార్జీలను 4.83 శాతం పెంచారు. దీంతో, యూనిట్‌కు 20 నుంచి 55 పైసల వరకు ఛార్జీ పెంపుతో సబ్సిడీ, ప్రభుత్వం అందించే సబ్సిడీ కూడా పెరిగింది. అందువల్ల, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అదనంగా రూ.519.25 కోట్లు విద్యుత్ బోర్డుకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విద్యుత్ నియంత్రణ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది.

అంబత్తూర్‌లో ఘనంగా ముగిసిన మండలాభిషేక పూజలు



భక్తిగీతాలు ఆలపిస్తున్న అరుణా శ్రీనాథ్

ప్యారీస్, ఆగస్టు 17: స్థానిక అంబత్తూర్‌లో శ్రీ కన్యకా పరమేశ్వరి చారిటబుల్ ట్రస్ట్, అంబత్తూర్ ఆర్యవైశ్య సంఘం సంయుక్తంగా నూతనంగా నిర్మించిన కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో 48 రోజుల మండలాభిషేకం పూజలు శనివారం సాయంత్రం భక్తి సంగీత కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. ధనుంజయన్, టీఎస్ కుమార్, మధుప్రియ, శాంతారామ్, కల్పన తదితరులు ముగింపు పూజల్లో పాల్గొనగా, ప్రముఖ గాయని ఎడవల్లి అరుణా శ్రీనాథ్ భక్తిగీతాలతో అలరించారు. సంగీత దిగ్గజాలు త్యాగరాజస్వామి, అన్నమయ్య, పురందరదాస్ వంటి వారు రచించిన కీర్తనలు శ్రావ్యంగా ఆలపించి అలరించారు.

పామాయిల్, కందిపప్పు కొరత లేదు

● అదనపు ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణన్

ప్యారీస్, ఆగస్టు 17: చౌక దుకాణాల ద్వారా పామాయిల్, కందిపప్పు కొరత లేకుండా చర్యలు తీసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డా.జె.రాధాకృష్ణన్ పేర్కొన్నారు. విల్లుపురంలో ఉన్న తమిళనాడు పౌరసరఫరాల శాఖ గిడ్డంగి, సహకార హోల్‌సేల్ విక్రయ కేంద్రాలను రాధాకృష్ణన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... విల్లుపురం జిల్లాలో గత ఏడాది రైతులకు రూ.670 కోట్ల వరకు సహకార సంఘాల ద్వారా రుణాలు అందజేసినట్లు తెలిపారు. అందువల్ల 1.2 లక్షల మందికి పైగా రైతులు లబ్ధిపొందారని చెప్పారు. రాష్ట్రంలో 20.44 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 380 గోడౌన్లు ఉన్నాయని, వీటిలో చౌక దుకాణాలకు తరలించాల్సిన పామాయిల్, కందిపప్పు, బియ్యం తదితర సరుకులు అవసరమైనంత నిల్వలుంచారని తెలిపారు. ఆయనతో పాటు జిల్లా కలెక్టర్ పళని, అధికారులు పెరియస్వామి తదితరులు కూడా పరిశీలించారు.

ఫిర్యాదులు పరిష్కరించకుండా వదిలేస్తే చర్యలు

● జీసీసీ కమిషన్ హెచ్చరిక

పెరంబూర్, ఆగస్టు 17: ప్రజల ఫిర్యాదులు పరిష్కరంచకుండా, అవి ముగిసినట్లు నమోదు చేసే ఉద్యోగులపై చర్యలు చేపడతామని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ హెచ్చరించారు. జీసీసీ పరిధిలోని 200 వార్డుల్లో సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేసేలా నెం.1913'ను పరిచయం చేశారు. తమ ప్రాంతాల్లోని డ్రైనేజీ, రోడ్లు సహా ఇతర సమస్యలను ప్రజలు ఈ నెంబరు ద్వారా ఫిర్యాదు చేస్తున్నారు. కానీ, కొందరు ఉద్యోగులు ఈ సమస్యలు పరిష్కరించకుండా అవి ముగిసినట్లు నమోదు చేస్తున్నారని కార్పొరేషన్‌కు ఫిర్యాదులందాయి. ఈ విషయమై స్పందించిన కమిషనర్, ఫిర్యాదులు పరిష్కరించని ఉద్యోగులపై చర్యలు చేపడతానని హెచ్చరించారు.

పీఎం ఆవాస్ యోజన పథకంలో అవినీతి

● 13 మంది ప్రభుత్వ అధికారులపై చర్యలు

వేళచ్చేరి, ఆగస్టు 17: ప్రధాన మంత్రి గృహ నిర్మాణ పథకానికి సంబంధించి కృష్ణగిరి జిల్లాకు చెందిన 13 మంది ప్రభుత్వ అధికారులపై చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. ప్రధాన మంత్రి గృహ నిర్మాణ పథకం(పీఎం ఆవాస్ యోజన)లో కృష్ణగిరికి కేటాయించిన నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ 2021లో గంగాధరన్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాన్ని తాత్కాలిక న్యాయమూర్తి కృష్ణకుమార్, న్యాయమూర్తి బాలాజీలతో కూడిన ధర్మాసనం విచారించింది. అప్పటి గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఈశ్వరన్ విచారణ జరిపి నివేదిక అందించారు. ప్రభుత్వ తరఫు న్యాయవాది తరఫున, అవినీతికి సంబంధించి 13 మంది ప్రభుత్వ అధికారులపై క్రమశిక్షణా చర్యలు చేపట్టినట్లు, దుర్వినియోగమైన నిధులు రికవరీకి చర్యలు చేపట్టామని ప్రభుత్వం తెలియజేసింది. ఇరుతరఫు వాదనల అనంతరం ధర్మాసనం... అధికారులపై చర్యలు తీసుకున్నందున ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం లేదని పేర్కొంటూ కేసు విచారణ ముగిసినట్లు ప్రకటించింది.

మహిళా సాధికారిక నిధి కోరుతూ కలెక్టరేట్ ముట్టడి



ఆందోళనలో మహిళలు

పెరంబూర్, ఆగస్టు 17: రాష్ట్రప్రభుత్వం ప్రతినెలా రూ.1,000 అందజేసే మహిళా సాధికారిక నిధులు తమకు అందించాలని కోరు తూ మహిళలు కోవై జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. మహిళా సాధికారిక నిధి పథకంలో కొత్త లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు కలెక్టర్ కార్యాలయంలో శనివారం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. దీంతో, శనివారం ఉదయం మహిళలు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేతబట్టి కార్యాలయానికి చేరుకున్నారు. తాము గతంలో దరఖాస్తు చేసుకున్నా తమను ఎంపిక చేయలేదని, ఈసారైనా తమను ఎంపిక చేసి రూ.1,000 అందించాలని మహిళలు గళమెత్తారు. ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు తాము ప్రకటించలేదని జిల్లా అధికారులు స్పష్టం చేయడంతో, కొద్దిసేపు ఆందోళన చేపట్టిన మహిళలు అక్కడి నుంచి వెనుదిరిగారు.

కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో మొబైల్ వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభం



జెండా ఊపి సంచార వైద్యశాలను ప్రారంభిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ నార్త్ అండ్ బే ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మొబైల్ వెల్‌నెస్ క్లినిక్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం శనివారం ఉదయం ప్రారంభించారు. చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాల్లోని నిరుపేదలకు, దివ్యాంగులైన చిన్నారులకు ఈ సంచార వైద్యశాల మెరుగైన వైద్యసేవలందిస్తుందని కావేరి ఆసుపత్రుల గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తెలిపారు. ఈ సంచార వైద్యశాలలో ఈసీజీ, ఎకో కార్డియోగ్రాం, ఎక్స్‌రే, బీఎండీ స్కానర్లు ఉన్నాయని, మధుమేహం, రక్తపీడనం, నరాల వ్యాధి, కంటి రోగాలకు తగిన పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల వద్ద ఈ సంచార వైద్యశాల ద్వారా ఉచిత వైద్య శిబిరాలు జరుపుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్‌ఆఫ్ మద్రాస్ నార్త్ చైర్మన్ రొటేరియన్ డాక్టర్ పి.సతీష్, బే ఫోర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జులియన్ క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నాలుగు నెలల చిన్నారి సహా ఇద్దరి మృతి

పెరంబూర్, ఆగస్టు 17: స్థానిక ఉద్దాండి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నాలుగు నెలల చిన్నారి సహా ఇద్దరు మృతి చెందారు. కానత్తూర్ ప్రాంతానికి చెందిన ముత్తక్ అహ్మద్, పొనాసిర్ దంపతులకు రెండేళ్ల, 4 నెలల కుమార్తెలున్నారు. దంపతులు పిల్లలతో కలసి శుక్రవారం సాయంత్రం స్కూటర్‌పై మహాబలిపురం వైపుకు బయల్దేరారు. ఈసీఆర్ రోడ్డులో ప్రయాణిస్తున్న స్కూటర్ అదుపుతప్పడంతో నలుగురు కింద పడ్డారు. ఆ సమయంలో వెనుకగా వచ్చిన ప్రభుత్వ బస్సు ముందు చక్రం పొనాసిర్‌పై దూసుకెళ్లడంతో ఆమె దుర్మరణం చెందారు. ఈ ఘటనలో గాయపడిన ముగ్గురిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్సలు ఫలించక నాలుగు నెలల చిన్నారి మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

లంచం ఆశించిన డిప్యూటీ తహసీల్దార్ అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 17: తిరువారూరు జిల్లా మన్నార్‌కుడిలో పట్టాలో మార్పులు చేసేందుకు రూ.12 వేలు లంచం తీసుకున్న డిప్యూటీ తహసీల్దార్ నాగరాజ్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. మన్నార్‌కుడి మున్సిపాలిటీ 7వ వార్డు డీఎంకే కౌన్సిలర్ భర్త శక్తివేల్ ఫిర్యాదుతో, కార్యాలయంలో మాటువేసిన అధికారులు నాగరాజ్ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని విచారిస్తున్నారు.

మహిళా బాత్రూంలో కెమెరా ఉంచిన వ్యక్తి అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 17: స్థానిక టి.నగర్‌లో మహిళా బాత్రూంలో కెమెరా ఉంచిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వడపళనికి చెందిన 26 ఏళ్ల యువతి టి.నగర్‌లోని పాండి బజార్‌లోని ఫ్యాన్సీ స్టోర్‌లో పనిచేస్తుంది. ఆమె శుక్రవారం మధ్యాహ్నం మహిళా ఉద్యోగులు వినియోగించే బాత్రూంకు వెళ్లింది. ఆ సమయంలో అక్కడి కిటికీలో కెమెరా ఆన్‌చేసిన సెల్‌ఫోన్ ఉండడం గమనించింది. ఆమె సెల్‌ఫోన్ తీసుకొని బయటకు వచ్చిన సమయంలో అక్కడే ఉన్న ఓ వ్యక్తి, ఆ సెల్‌ఫోన్ తనదని ఆమెను బెదిరించి దానిని తీసుకొని పరారయ్యాడు. ఈ ఘటనపై బాధిత యువతి అందజేసిన ఫిర్యాదుతో సౌందిరపాండియార్ అంగాడి పోలీసులు కేసు నమోదుచేసి, ఈ చర్యకు పాల్పడిన టి.నగర్‌కు చెందిన మణికంఠన్‌ను అరెస్ట్ చేశారు.

న్యాయవాదిపై దాడి

రైల్వే ఇన్‌స్పెక్టర్‌పై ఫిర్యాదు

ప్యారీస్, ఆగస్టు 17: స్థానిక విల్లివాక్కం ఐసీఎఫ్ సమీపంలో న్యాయవాది రాజేష్‌పై దాడికి పాల్పడిన రైల్వే ఇన్‌స్పెక్టర్ దిలీప్‌సింగ్‌పై న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సుబ్రమణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరువొత్తియూర్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న రాజేష్ శుక్రవారం తన ద్విచక్ర వాహనంలో ఐసీఎఫ్ రైల్వే క్వార్టర్స్ మీదుగా వెళ్లారు. అప్పుడు పండ్లు విక్రయిస్తున్న ఓ మహిళను రైల్వే ఇన్‌స్పెక్టర్ దిలీప్‌సింగ్, రైల్వే క్వార్టర్స్‌లో పండ్లు విక్రయించరాదని మందలించినట్లు తెలిసింది. దీన్ని ఖండించిన రాజేష్‌పై దిలీప్‌సింగ్ దాడికి పాల్పడ్డాడు. దాడిలో గాయపడిన రాజేష్‌ను ప్రభుత్వ స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా తిరువొత్తియూర్ న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు సుబ్రమణి ఐసీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మూడు శీతల పానీయాల దుకాణాల సీజ్

వేళచ్చేరి, ఆగస్టు 17: మదురైలో మూడు శీతలపానీయాలు దుకాణాలను ఆహార భద్రతా శాఖ అధికారులు సీజ్ చేశారు. కాలపరిమితి ముగిసిన శీతల పానీయాలు విక్రయిస్తున్నట్లు అందిన ఫిర్యాదులతో, శనివారం ఆ దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు, ఫిర్యాదులు వాస్తవమని తేలడంతో సీజ్ చేశారు.

ఆలయ వేడుకల్లో ఘర్షణ

● అన్నదమ్ముల దారుణహత్య

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిరునెల్వేలి జిల్లా ఓడైకరైలోని కడలైమాడసామి ఆలయ వేడుకల సందర్భంగా శనివారం వేకువజామున జరిగిన ఘర్షణలో మదిఅళగన్, మదిరాజా అనే అన్నదమ్ములు దారుణహత్యకు గురయ్యారు. మహేశ్వరన్ అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి రాజ్‌కుమార్, వరుణ్‌కుమార్, విపిన్‌ను దిసైవిళై పోలీసులు అరెస్టు చేశారు.

శ్రీలంక చెర నుంచి తిరిగొచ్చిన రామేశ్వరం జాలర్లు

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గత జూలై 1న శ్రీలంక నావికాదళం అరెస్టు చేసి తరలించుకెళ్లిన తమిళ జాలర్లు 13 మందికి ఎట్టకేలకు విముక్తి లభించింది. ముఖ్యమంత్రి స్టాలిన్ చొరవ తీసుకుని కేంద్రప్రభుత్వానికి పలు మార్లు లేఖలు రాయటం, రాయబార అధికారులు తక్షణ చర్యలు చేపట్టడంతో శ్రీలంక జైలులో ఉన్న రామేశ్వరం, పుదుకోట లకు చెందిన 13 మంది జాలర్లను అక్కడి ప్రభుత్వం విడుదల చేసింది. వీరికి భారత రాయబార కార్యాలయం అధికారులు విమాన టికెట్లు కొనివ్వడంతో శుక్రవారం రాత్రి విమానంలో బయలుదేరి చెన్నై విమానాశ్రయం చేరుకున్నారు. మత్స్యశాఖ అధికారులు ఆ జాలర్లకు స్వాగతం పలికి చెన్నై నుంచి వారి స్వస్థలాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో పంపారు.

శివగంగ వద్ద తుపాకీతో కాల్చి రౌడీ అరెస్టు

చెన్నై, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా కాలయర్‌కోవిల్ వద్ద శనివారం ఉదయం వాహన తనిఖీల సందర్భంగా పట్టుబడి ఎస్‌ఐపై దాడి జరిపి పారిపోతున్న పేరుమోసిన రౌడీ అఖిలన్‌ను సీఐ ఆడివేల్ తుపాకీతో కాల్చి అరెస్టు చేశారు. ఈ సంఘటనలో రౌడీ అఖిలన్ కుడికాలిలో తూటా దూసుకుపోయింది. దీంతో చికిత్స నిమిత్తం అతడిని శివగంగ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివగంగ జిల్లాలలో గత నెల రోజులుగా రౌడీల వేట ముమ్మరంగా సాగుతోంది. గత జూలై 27న కూడా పారిపోతున్న వసంతకుమార్‌పై పోలీసులు కాల్పులు జరిపి అరెస్టు చేశారు. ప్రస్తుతం అదే రీతిలో మరో రౌడీని కూడా తుపాకీతో కాల్చి పోలీసులు అరెస్టు చేయడం ఆ జిల్లాల్లో కలకలం సృష్టిస్తోంది.

600 మెగావాట్ల విద్యుదుత్పత్తి నిలిపివేత

ఐసీఎఫ్, ఆగస్టు 17: మేట్టూరు థర్మల్ విద్యుత్ కేంద్రంలో పర్యవేక్షణ పనుల కారణంగా 600 మెగావాట్ల విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. ఈ కేంద్రంలో రెండు విభాగాలు పనిచేస్తున్నాయి. మొదటి విభాగంలో తలా 210 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్ల ద్వారా 840 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది. రెండో విభాగంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్ పని చేస్తోంది. ప్రస్తుతం రెండో విభాగంలోని యూనిట్‌లో సంవత్సరాంతపు పర్యవేక్షణ పనులు చేపడుతుండడంతో సెప్టెంబరు 15వ తేది వరకు ఉత్పత్తి నిలిపివేస్తున్నట్లు పవర్ స్టేషన్ ఇంజనీర్లు తెలిపారు.

అక్టోబరు 29 నుంచి ఓటరు జాబితా సవరణలు

ఐసీఎఫ్, ఆగస్టు 17: రాష్ట్రంలో అక్టోబరు 29 నుంచి నవంబరు 28వ తేది వరకు ఓటరు జాబితాలో సవరణల ప్రక్రియ జరుగుతుందని ప్రధాన ఎన్నికల అధికారి సత్యప్రదసాహూ పేర్కొన్నారు. పోలింగ్ బూత్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటరు కార్డు పరిశీలన, పోలింగ్ బూత్‌ల వర్గీకరణ, ఓటరు కార్డులో ఫొటో లేకపోవడం వంటివి గుర్తించే పనులు ఈనెల 20 నుంచి అక్టోబరు 18వ తేది వరకు చేపట్టనున్నారని తెలిపారు. నమూనా ఓటరు జాబితా అక్టోబరు 29వ తేది విడుదల కానుందని, ఆ రోజు నుంచి నవంబరు 28వ తేది వరకు ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, చిరునామా చేర్పులు, మార్పులు వంటివి జరుగుతాయని తెలిపారు. తుది ఓటరు జాబితా 2025 జనవరి 6వ తేది విడుదల చేయనున్నట్లు సత్యప్రదసాహూ తెలిపారు.

కార్ రేస్ నిర్వహిస్తే చెన్నై 'ఫేమస్' అవుతుంది

● కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం

పెరంబూర్, ఆగస్టు 17: కార్ రేస్ నిర్వహిస్తే ప్రపంచస్థాయిలో చెన్నై ఫేమస్ అవుతుందని, చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు నడిపి ఇప్పటికే పేరుగాంచిందని, చెన్నైలో కార్ రేస్ నిర్వహణలో ఎలాంటి తప్పు లేదని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రైల్వే శాఖ అవుట్ సోర్సింగ్ విధానంలో ఖాళీ పోస్టులు భర్తీ చేస్తోందని, అలా నియమితులైన వారికి తగిన అనుభవం లేకపోవడంతో వారానికి రెండు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కొత్త ఆలోచనలతో రైల్వే శాఖను అభివృద్ధి చేయాలని కోరారు. రాష్ట్ర గవర్నర్ తేనీటి విందుకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి స్టాలిన్ హాజరయ్యారని, అందులో ఎలాంటి రాజకీయం లేదన్నారు. పార్టీ తరఫున ఎవరూ వెళ్లలేదనే విషయం గుర్తించాలని తెలిపారు. నటి ఖుష్బూ ఒలింపిక్స్ లాంటిదని, నాలుగేళ్లకు ఒకసారి పార్టీ మారడం ఆమె ఆనవాయితీ అని ఎంపీ కార్తీ ఎద్దేవా చేశారు.



SUNDAY SPECIAL

భలే... భలే... గాలిపటాలు

● ఈసీఆర్‌లో ఎగురుతున్న పతంగులు

(పెరంబూర్)

జల్లికట్టు ఎద్దు, డాల్ఫిన్, ఆక్టోపస్, షార్క్ చేప తదితరాలు ఆకాశంలో ఎగురుతుంటే చూడాలని ఉందా..? మరెందుకు ఆలస్యం... ఈసీఆర్ రోడ్డు వెళదాం రండి..!

రాష్ట్ర పర్యాటక శాఖ, గ్లోబల్ మీడియా బాక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈస్ట్‌కోస్ట్ రోడ్డులోని తిరువిడంధై బీచ్‌లో మూడోసారి 'అంతర్జాతీయ గాలిపటాల పండుగ నిర్వహిస్తున్నారు. ఈనెల 15న ప్రారంభమైన ఈ ప్రదర్శన ఆదివారంతో ముగియనుంది. ఈ ప్రదర్శనలో ఫ్రాన్స్, జర్మనీ, థాయ్‌ల్యాండ్, వియత్నాం, స్విట్జర్లాండ్ సహా దేశంలోని



పలు నగరాల నుంచి సుమారు 40 మంది కైట్ ఫ్లైయర్స్ (గాలిపటాలు ఎగురవేసేవారు) పాల్గొని, 250కి పైగా గాలిపటాలు ఎగరవేస్తున్నారు. జల్లికట్టు ఎద్దు, డాల్ఫిన్, ఆక్టోపస్ సహా పలురకాల డిజైన్లు, రంగులతో గాలిపటాలు తయారయ్యాయి. ఈ మైదానంలోని పలు చోట్ల నుంచి కైట్ ఫ్లైయర్స్ తమ గాలిపటాలను ఎగురవేస్తున్నారు. ఆకాశంలో గాలిపటాలు ఎగురుతున్న సమయంలో ఆయా ఆకృతులు నిజంగా ఎగురుతున్నాయా అని భ్రమ కలిగిస్తూ చిన్నారులు, పెద్దలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనకు వచ్చే వారికి కోసం మైదానంలోని పలు ప్రాంతాల్లో చిన్న హోటళ్లు, సంగీత కచ్చేరి సహా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గాలిపటాలకు అనుకూలం...

గాలిపటాలు ఎగరాలంటే గాలి వేగం అనుకూలంగా ఉండాలని, రాష్ట్రంలోని కోస్తా తీరప్రాంతం ఇలాంటి కార్యక్రమాలకు ఎంతో అనువుగా ఉందని ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివ్ డైరెక్టర్ బెనెడిక్ట్ సావియో తెలిపారు. ఈ ప్రదర్శన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో గాలిపటాలు ఎగురవేసే శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆలోచన ఉందన్నారు. ఇందుకు రాష్ట్రప్రభుత్వం సహకారం ఆశిస్తున్నామన్నారు. గాలిపటాలు ఎగురవేయడం నైపుణ్యంతో కూడిన హాబీగా ఉందని తెలిపారు. యువతకు ఆక్రోబేటిక్ కైట్ శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వివిధ రకాల గాలిపటాలు తయారు చేయడం, వాటిని ఎగుర వేయడంలో చేపట్టాల్సిన నైపుణ్యం, గాలి వేగం అంచనా తదితరాలపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పొందిన వారు అంతర్జాతీయ గాలిపటాల పండుగల్లో పాల్గొనవచ్చని తెలిపారు. తమిళనాడులో ఈ పండుగలు నిర్వహిస్తుండగా, ఇందులో రాష్ట్ర సంప్రదాయమైన తంజావూరు బొమ్మలు, జల్లికట్టు ఎద్దు, నీలగిరి కొమ్ముల జింక తదితర నమూనాల్లో గాలిపటాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయని బెనెడిక్ట్ తెలిపారు. గత ఏడాది కైట్ ఫెస్టివల్‌లో 150 గాలిపటాలు ప్రదర్శించగా ప్రస్తుతం 250కి పైగా ఉన్నాయన్నారు. అలాగే, గత ఏడాది ఈ ప్రదర్శనను 20,000 మంది వీక్షించగా, ఈ ఏడాది 30,000 దాటే అవకాశముందని నిర్వాహకులు తెలిపారు.

రూ.2.5 లక్షలతో జల్లికట్టు ఎద్దు గాలిపటం...

ఈ ప్రదర్శనలో రాష్ట్ర తరఫున పాల్గొన్న కైట్ ఫ్లైయర్స్ ఎగురవేస్తున్న జల్లికట్టు ఎద్దు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రూ.2.5 లక్షలతో 15 అడుగుల పొడవైన రిబ్‌స్టాప్ నైలాన్‌తో రూపొందించిన ఈ జలికట్టు ఎద్దు గాలిపటం తయారీకి మూడు నెలలు పట్టిందని స్కైటర్లు తెలిపారు.


ఎగిరేందుకు సిద్ధంగా ఉన్న జల్లికట్టు ఎద్దు పటం

పర్యాటకులే న్యాయనిర్ణేతలు...

ఈ ప్రదర్శన మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై సూర్యాస్తమయం వరకు కొనసాగుతోంది. ఈ ప్రదర్శన వీక్షించే పర్యాటకులు తమకిష్టమైన గాలిపటాన్ని ఎంపిక చేయవచ్చు. అలా ఎక్కువ మంది ఎంపిక చేసిన గాలిపటాల స్కైటర్లను విజేతలుగా ప్రకటిస్తారు. ఇక, 12 ఏళ్ల లోపున్న పిల్లలకు ప్రవేశం ఉచితం కాగా, పెద్దలకు రూ.250గా నిర్ణయించారు. ఈ టిక్కెట్టుతో గాలిపటాలు ఎగురవేసే ప్రాంతం, షాపింగ్ ప్రాంతం, ఫుడ్ ప్రాంతం, మ్యూజిక్ ప్రాంతాలకు వెళ్లవచ్చు. గాలిపటాల ప్రదర్శన బహిరంగ ప్రదేశంలో కావడంతో సీటింగ్ వసతి ఉండదు. బయట ప్రాంతాల నుంచి తీసుకెళ్లే ఆహార పదార్థాలను, తినుబండారాలను అనుమతించరు. అయితే నీడ కోసం గొడుగులు, బీచ్‌లో కూర్చొనేందుకు సీటింగ్ తీసుకెళ్లవచ్చు.




గాలిపటం ఎగురవేసేందుకు సిద్ధమవుతున్న కైట్ ఫ్లైయర్స్

'తంగలాన్'కు సీక్వెల్ - లీక్ చేసిన విక్రమ్!


'తంగలాన్'లో చియాన్ విక్రమ్

తాను నటించిన 'తంగలాన్' చిత్రానికి ఆదరణ లభిస్తే రెండో భాగాన్ని కూడా నిర్మించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారని ఆ సినిమా హీరో చియాన్ విక్రమ్ సూచన ప్రాయంగా వెల్లడించారు. పా.రంజిత్ దర్శకత్వంలో రూపొందిన 'తంగలాన్' సినిమా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న ఐదు భాషల్లో పాన్ ఇండియా మూవీగా విడుదలై హిట్ టాక్‌ను సొంతం చేసుకుని విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. తొలి రోజు దాదాపు రూ.26.50 కోట్ల మేరకు వసూళ్లను రాబట్టింది. ఇప్పటివరకు విడుదలైన చియాన్ విక్రమ్ సినిమాల్లో ఇదే అత్యధిక ఓపెనింగ్ కలెక్షన్స్. ఈ నేపథ్యంలో ఈ సినిమా రెండో భాగంపై హీరో ఓ విషయాన్ని సూచనప్రాయంగా వెల్లడించారు. 'తంగలాన్'కు ప్రేక్షకుల ఆదరణ లభించి, ఘన విజయం సాధిస్తే, రెండో భాగాన్ని కూడా తెరకెక్కించేందుకు నిర్మాణ సంస్థలు సిద్ధంగా ఉన్నాయి' అని పేర్కొన్నారు. పైగా రెండో భాగానికి సంబంధించిన సన్నాహాలను కూడా త్వరలోనే ప్రారంభించే అవకాశమున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. కాగా, తొలిభాగంలో విక్రమ్, పార్వతి, మాళవిక మోహనన్ హీరోహీరోయిన్లుగా నటించగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చారు. స్టూడియో గ్రీన్, నీలం ప్రొడక్షన్స్ పతాకాలపై నిర్మాతలు కేఈ జ్ఞానవేల్ రాజా, పా.రంజిత్ సంయుక్తంగా నిర్మించారు.

వైభవంగా వరలక్ష్మి వ్రతం

ప్యారీస్, ఆగస్టు 17: స్థానిక అన్నానగర్‌లోని పారిశ్రామికవేత్త శోభరాజ నివాసంలో వరలక్ష్మి వ్రత వైభవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గానకోకిల పి.సుశీల ముఖ్యఅతిథిగా పాల్గొని వరలక్ష్మి దేవిని తన గానంతో ఆరాధించి అభిషేకించారు. కళారంజని సంగీత పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ జె.శ్రీనుబాబు, తమిళనాడు తెలుగు పీపుల్స్ సొసైటీ వ్యవస్థాపక ఛైర్మన్ దేవరకొండ రాజు, అరుణా శ్రీనాథ్, పి.మణిమాలా రావు తదితరులు పూజల్లో పాల్గొని అమ్మవారిని సేవించారు.


వరలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు


గానకోకిల సుశీలతో శోభరాజ, మణిమాలారావు, శ్రీనుబాబు తదితరులు

● ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్

ఉత్తమ దర్శకుడిగా నితిలన్ స్వామినాథన్

మెల్‌బోర్న్ వేదికగా ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ వేడుకలు జరుగుతున్నాయి. ఇందులో ఉత్తమ దర్శకుడి అవార్డును 'మహారాజ' ఫేం నితిలన్ స్వామినాథన్ సొంతం చేసుకున్నారు. విజయ్ సేతుపతి నటించిన ఈ చిత్రానికి అవార్డు వరించింది. దీనిపై నితిలన్ మాట్లాడుతూ... 'ఈ సంతోష సమయంలో మాటలు రావడం లేదు. మా సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుతోపాటూ నాకు బెస్ట్ డైరెక్టర్ అవార్డు రావడంతో మా బృందం ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దీనికి కారణమైన విజయ్ సేతుపతి, నిర్మాత సుధన్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్యాషన్ స్టూడియోస్ నాకు ఒక మంచి అవకాశాన్ని ఇచ్చింది. యూనిట్‌లో ప్రతి ఒక్కరూ ఎంతగానో సహకరించారు. వారి మద్దతు లేకుండా ఇది సాధ్యం కాదు. భవిష్యత్తులో మంచి చిత్రాలను తీస్తా. విలక్షణమై, కథాబలమున్న చిన్న బడ్జెట్ చిత్రాలు కూడా పెద్ద హిట్ అవుతాయని 'మహారాజ' నిరూపించింది. సినిమాను ఇష్టపడే ఎందరో నిర్మాతలకు, దర్శకులకు ఇది మార్గదర్శకంగా నిలిచింది. ఈ సినిమా విమర్శకుల పరంగానేకాకుండా, బాక్సాఫీస్ వద్ద కూడా వసూళ్లను రాబట్టింది' అని పేర్కొన్నారు.


విజయ్ సేతుపతి, సుధన్, నితిలన్ స్వామినాథన్

హీరో అజిత్ 'మై మెంటర్'

● ఎస్‌జే సూర్య

అగ్రహీరో అజిత్ తన మెంటర్ అని దర్శక నటు డు ఎస్‌జే సూర్య చెప్పుకొచ్చారు. చాలా కాలం తర్వాత అజిత్‌తో కలిసి పనిచేయడం చిరస్మరణీయ జ్ఞాపకాల్లో ఒకటిగా మిగిలిపోతుందన్నారు. ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్ హీరోగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' పేరుతో తెరకెక్కుతున్న చిత్రంలో నటిస్తున్నారు. సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని ఆర్‌ఎఫ్‌సీలో శరవేగంగా జరుపుకుంటోంది. పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్నట్టు సమాచారం. ఇందులో దర్శక నటుడు ఎస్‌జే సూర్య ఒక ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. అయితే, అజిత్ హీరోగా ఎస్‌జే సూర్య దర్శకత్వంలో కొన్నేళ్ల క్రితం 'వాలి' సినిమా వచ్చింది. అజిత్ ద్విపాత్రాభినయం చేయగా, మెగా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమా తర్వాత వీరిద్దరూ కలిసి పనిచేయలేదు. ఇపుడు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కోసం కలిశారు. దీనిపై ఎస్‌జే సూర్య స్పందిస్తూ, 'చాలా సంవత్సరాల తర్వాత నా జీవితంలో అత్యంత ఆనందకర క్షణాలు. అజిత్ కుమార్ నా మెంటర్. ఆయన ఎంతో గొప్ప వ్యక్తి' అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తూ, అజిత్‌తో కలిసి తాను దిగిన ఫొటోను షేర్ చేశారు.


అజిత్‌తో ఎస్‌జే సూర్య

చిత్రజ్యోతి

మహత్ - మీనాక్షి జంటగా 'కాదలే.. కాదలే'

'మంగాత్తా' సినిమా ద్వారా ప్రేక్షకుల్లో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న నటుడు మహత్ రాఘవేంద్ర. పలు చిత్రాల్లో మంచి పాత్రలను పోషించిన మహత్... ప్రస్తుతం 'కాదలే కాదలే' పేరుతో తెరకెక్కనున్న చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. మీనాక్షి హీరోయిన్. సీనియర్ దర్శకుడు, దివంగత కేవీ ఆనంద్ వద్ద అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేసిన ఆర్.ప్రేమానంద్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మోడ్రన్ లవ్ నేపథ్యంలో రూపొందించే ఈ చిత్రంలో నేటి టీనేజ్ యువతీ యువకుల మధ్య ఉండే సంబంధాలు, ప్రేమ తదితర అంశాలను టచ్ చేస్తూ కొనసాగనుంది. ఇందులో ఇతర పాత్రల్లో భారతీరాజా, వీటీవీ గణేష్, రవీనా, పుగళ్, నాజర్‌తో పాటు పలువురు నటీనటులు ఇతర పాత్రలను పోషించారు. శ్రీవారి ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత పి.రంగనాథన్ నిర్మించిన ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూరుస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ పోస్ట్‌ప్రొక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. త్వరలోనే ట్రైలర్, ఆడియో, చిత్ర విడుదల తేదీలను ప్రకటించనున్నారు.


'కాదలే కాదలే'లో మహత్ - మీనాక్షి

అన్నాడీఎంకే గెలుపు కోసం తిరుమలకు పాదయాత్ర

ప్యారీస్, ఆగస్టు 17: యేటా దేశం సౌభాగ్యం కోసం తిరుమలకు కాలినడకన వెళ్లే ఉంగళుక్కాగ సంస్థ వ్యవస్థాపకుడు, అన్నాడీఎంకే యువజన విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్... ఈసారి అన్నాడీఎంకే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందాలని పాదయాత్ర చేపట్టారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో 2026లో అసెంబ్లీకి జరుగనున్న ఎన్నికల్లో 200 స్థానాలకు పైగా గెలుపొంది ఈపీఎస్ ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న కోరికతో సునీల్ చేపట్టిన ఈ యాత్రలో అన్నాడీఎంకే శ్రేణులు పలువురు పాల్గొన్నారు.


తిరుమలకు మహా పాదయాత్రగా వెళుతున్న డాక్టర్ సునీల్

వాషర్‌మెన్‌పేటలో వాకింగ్ కాంప్లెక్స్



పెరంబూర్, ఆగస్టు 17: స్థానిక వాషర్‌మెన్‌పేటలో రూ.28 కోట్లతో ఫుట్‌పాత్‌తో కూడిన కాంప్లెక్స్ ఏర్పాటు కానుంది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని స్మార్ సిటీ పథకంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. 2019లో టీనగర్ పాండి బజార్‌లో రూ.39 కోట్లతో ఆధునిక వసతులతో ఫుట్‌పాత్ ఏర్పాటైన విషయం విదితమే. ప్రస్తుతం ఈ పథకంలో వాషన్‌మెన్‌పేట ఎంసీ రోడ్డులో ఈ కాంప్లెక్స్ ఏర్పాటుకు జీసీసీ చర్యలు చేపట్టింది. బీఎస్ఎన్ఎల్ జంక్షన్ నుంచి ప్రారంభమై సిమెట్రీ రోడ్డు జంక్షన్ వరకు ఈ ఫుట్‌పాత్ కాంప్లెక్స్ అందుబాటులోకి రానుంది. ఈ కాంప్లెక్స్ నిర్మాణం 18 నెలల్లో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు తెలిపారు.

కుట్రాలం జలపాతం వద్ద సారల్ వేడుకలు


విద్యుద్దీపాల వెలుగుల్లో కుట్రాలం ప్రధాన జలపాతం

పెరంబూర్, ఆగస్టు 17: సీజన్‌ను పురస్కరించుకొని కుట్రాలం జలపాతం వద్ద సారల్ వేడుకలు జరపాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఈ వేడుకల సందర్భంగా ప్రధాన జలపాతం వద్ద రంగు రంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. రాత్రి సమయాల్లో ఈ దీప కాంతుల నడుమ జలపాతం నుంచి నీరు ప్రవహించే దృశ్యాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ వేడుకలు ఈనెల 19వ తేది వరకు జరుగుతాయని జిల్లా యంత్రాంగం ప్రకటించింది.

పళవేర్కాడులో ఫ్లెమింగోల సందడి



పెరంబూర్, ఆగస్టు 17: తిరువళ్లూర్ జిల్లా పళవేర్కాడు నది తమిళనాడు - ఆంధ్ర ప్రాంతాలు అనుసంధానం చేసేలా 481 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఈ నది ప్రాంతంలోని చిత్తడి భూముల్లో ఆహారం కోసం పలు రకాల విదేశీ పక్షులు వస్తుంటాయి. సాధారణంగా సెప్టెంబరు చివరి వారం, అక్టోబరు మొదటి వారంలో విదేశీ పక్షులు ఈ ప్రాంతానికి చేరుకొని సంతానోత్పత్తి చేసి మార్చి, ఏప్రిల్ నెలల్లో తమ ప్రాంతాలకు వెళ్తుంటాయి. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడంతో జిల్లాలోని జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. ఈ క్రమంలో, ఫ్లెమింగో పక్షులు నిర్ణీత కాలం కన్నా ముందే ఈ ప్రాంతానికి చేరుకున్నాయి. పొడవాటి కాళ్లతో తెలుపు, ఎరుపు రంగుల్లో పళవేర్కాడు నదిలో చేపల వేట సాగిస్తున్న ఫ్లెమింగోలను బైనాక్యులర్ ద్వారా వీక్షిస్తూ పర్యాటకులు మైమరచి పోతున్నారు.

దివ్యాంగుల అభయ హస్తంగా నమో గాడ్ ట్రస్ట్

● ఆచార్య సీఎంకే రెడ్డి

ప్యారీస్, ఆగస్టు 17: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న దివ్యాంగులకు నమో గాడ్ చారిటబుల్ ట్రస్ట్ అభయ హస్తంగా ఉందని అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) అధ్యక్షుడు, ట్రస్ట్ పోషకుడు ఆచార్య సీఎంకే రెడ్డి పేర్కొన్నారు. నమో గాడ్ చారిటబుల్ ట్రస్ట్, ఫ్రీడం ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కృత్రిమ కాలు కొలతల శిబిరం శనివారం ఉదయం స్థానిక కొరట్టూరులోని మోహన్ గార్డన్‌లో జరిగింది. సుమారు 85 మందికి పైగా కాళ్లు పోగొట్టుకున్న దివ్యాంగులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. శిబిరాన్ని ఆచార్య సీఎంకే రెడ్డి ప్రారంభించి ప్రసంగిస్తూ... రెండేళ్ల క్రితం కుల మత భాషా భేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు అంకితభావంతో సేవలందించాన్న దృక్పథంతో ప్రారంభించిన నమో గాడ్ ట్రస్ట్ అభయ హస్తంగా ఉందన్నారు. మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సీఎం కిషోర్ సభాధ్యక్షుడిగా వ్యవహించి మాట్లాడుతూ... తమ ట్రస్ట్ తరఫున దివ్యాంగులు, అభాగ్యులకు కుటీర, చిన్న వృత్తులకు సంబంధించిన శిక్షణ ఇప్పించడంతో పాటు బ్యాంకుల నుంచి రుణ సాయం అందించనున్నట్లు తెలిపారు. ట్రస్ట్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా కృత్రిమ అవయవాలు, ట్రై సైకిళ్లు, వీల్ ఛైర్ తదితరాలను కూడా పలువురు దాతల సహకారంతో అందజేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో కేంద్ర ప్రభుత్వ అధికారి డాక్టర్ పరమేశ్వర్, ఫ్రీడం ట్రస్ట్ బోర్డు సభ్యుడు డి.సుదర్శన్ రెడ్డి, రొటేరియన్ పి.కాశ్వి, ట్రస్టీలు డాక్టర్ ఆర్.నందగోపాల్, డాక్టర్ ఎం.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


కాలు కొలతల శిబిరంలో ఆచార్య సీఎంకే రెడ్డి, డాక్టర్ సీఎం కిషోర్ తదితరులు